https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 29 శనివారం 23-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# ల్యాప్‌టాప్ ధరలు పైపైకి!

**నెల రోజుల్లోనే దాదాపు 30శాతం పెరుగుదల**

**ఇంకా 10శాతం పెరుగుతాయని అంచనాలు**

**చిప్‌ల కొరత, రూపాయి పడిపోవడం వల్లే**

**ఏఐ నేపథ్యంలో హై డెఫినెషన్‌వైపే మొగ్గు**

**ల్యాప్‌టాప్ ఉత్పత్తి కూడా ఆ మేరకే**



**హైదరాబాద్ సిటీ, మే 22**

అసలే కృత్రిమ మేధ కాలం. ల్యాప్‌టాప్ లేకపోతే సమాజంతో పోటీ పడలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ల్యాప్‌ట్ష?పల ధరలు అంతకంతకూ పెరుగుతూ పోవడం ఆందోళన కలిగిస్తోంది. పిల్లల చదువుల కోసమని, ఉద్యోగాల కోసమని ల్యాప్‌టాప్ కొందామనుకున్నవారిని పెరుగుతున్న ధరలు భయపెడుతున్నాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలోనే ల్యాప్‌ట్ష?పల ధరలు దాదాపు 30శాతం వరకు పెరిగాయి. ఇంకా 10శాతం పెరగవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ల్యాప్‌ట్ష?పల తయారీలో ఉపయోగించే చిప్‌ల కొరత, ర్యామ్, జీపీయూల ధరలు పెరగడం, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఇందుకు కారణమని పేర్కొంటున్నారు. రోజురోజుకు పడిపోతున్న రూపాయి విలువ కూడా ల్యాప్‌ట్ష?పల ధరలు పెరగడానికి కారణమన్నారు. ల్యాప్‌టాప్ బేసిక్ కాన్ఫిగరేషన్ అయినా, గేమింగ్ ల్యాప్‌ట్ష?పలు అయినా ధరలు 30శాతం వరకు పెరిగాయని హైదరాబాద్‌లోని సీటీసీలో ఉన్న ఓ సుప్రసిద్ధ ల్యాప్‌టాప్ కంపెనీ డీలర్ అగర్వాల్ తెలిపారు. "లెనెవో, హెచ్‌పీ ఇలా ఏ కంపెనీ తీసుకున్నా బేసిక్ ల్యాప్‌టాప్ గతంలో రూ.25-రూ.30 వేలు పెడితే వచ్చేది. ఇప్పుడు మాత్రం రూ.35-రూ.40 వేలు పెట్టాల్సి వస్తోంది. అయినా కూడా ఇప్పుడు బేసిక్ ల్యాప్‌ట్ష?పలు దొరుకుతాయన్న గ్యారెంటీ లేదు. ఎందుకంటే, ఆ తరహా ల్యాప్‌ట్ష?పల ఉత్పత్తిని కంపెనీలు తగ్గిస్తున్నాయి" అని అన్నారు. ఇండియాలో ఏర్పాటవుతున్న డాటా సెంటర్లు, ఏఐ విప్లవం కారణంగా బేసిక్ ల్యాప్‌ట్ష?పల కోసం ఆర్డర్లు ఇచ్చే కంపెనీల సంఖ్య తగ్గుతోందని, అందువల్ల కంపెనీలు హైడెఫినెషన్ ల్యాప్‌ట్ష?పల తయారీకే ఎక్కువ మొగ్గు చూపిస్తున్నాయని తెలిపారు. పరిశ్రమ వర్గాల ప్రకారం ల్యాప్‌ట్ష?పల ధరలు గత డిసెంబర్‌లో స్వల్పంగా ధరలు పెరిగాయి కానీ, ఇరాన్ యుద్ధం మొదలైన తరువాత వేగంగా పెరుగుతున్నాయి. పెరిగిన ధరల నేపథ్యంలో ల్యాప్‌ట్ష?పలను కొనుగోలు చేయాలనుకున్న వినియోగదారులు తమ ఆలోచనలను వాయిదా వేసుకోవడమో, విరమించుకోవడమో చేస్తున్నారు. "మేం కొనాలనుకున్న ల్యాప్‌ట్ష?పకు కొద్దిరోజుల క్రితం రూ.40వేలు అవుతుంది అన్నారు. కానీ, ఇప్పుడు రూ.55వేలు చెప్తున్నారు. దీంతో, ల్యాప్‌టాప్ కొనాలనుకున్న నిర్ణయాన్ని వాయుదా వేసుకున్నాం" అని హైదరాబాద్‌లోని రహ్మత్‌నగర్‌కు చెందిన శేఖర్ చెప్పారు. ఇలా చాలా మంది కొనుగోళ్లన వాయిదా వేసుకుంటున్నారు. అయితే, ధరలు ఇప్పట్లో తగ్గబోవని, 2027వరకు ఇలాగే కొనసాగుతాయని మార్కెట్ వర్గాల అంచనా.

# రాజ్‌నాథ్‌తో సువేందు భేటీ

**- న్యూఢిల్లీలో కీలక సమావేశం**

**- పశ్చిమ బెంగాల్ అభివృద్ధిపై చర్చ - సువేందుపై రాజ్‌నాథ్ ప్రశంసలు**



**న్యూఢిల్లీ, మే 22**

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారితో సమావేశమయ్యారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ రాజకీయ పరిస్థితులు, పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు సమాచారం. సమావేశం అనంతరం రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ సువేందు అధికారిని ప్రశంసించారు. ఆయనకు గొప్ప రాజకీయ, శాసన అనుభవం ఉందని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సువేందు కృషి చేస్తారనే నమ్మకం తనకు ఉందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్రంలో ప్రతిపక్ష బలం పెంచేందుకు భారతీయ జనతా పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర నాయకత్వంతో సువేందు అధికారికి జరుగుతున్న వరుస సమావేశాలు చర్చనీయాంశంగా మారాయి. సువేందు అధికారి ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక నేతగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీపై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వివిధ ప్రజా సమస్యలపై తరచూ ఉద్యమాలు చేపడుతూ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి.

# డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్ట్

**- భారీ ఆస్తుల కేసులో ఏసీబీ దాడులు**

**- 11 ప్రాంతాల్లో సోదాలు.. కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు**



**హైదరాబాద్, మే 22 :**

మేడ్చల్-మల్కాజ్‌గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. అక్రమ ఆస్తుల కేసులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మొత్తం 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో కూడా తనిఖీలు చేపట్టగా భారీ స్థాయిలో ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఏసీబీ దర్యాప్తులో వంశీమోహన్‌కు చెందిన కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లను అధికారులు గుర్తించారు. అదనంగా రూ.1.2 కోట్ల విలువైన మూడు ఇళ్లు కూడా ఉన్నట్లు దర్యాప్తులో బయటపడింది. ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద రెండు ఎకరాల్లో నిర్మించిన ఫామ్ హౌస్ కూడా వంశీమోహన్‌కు చెందినదిగా ఏసీబీ అధికారులు గుర్తించారు. గతంలో శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురం ప్రాంతాల్లో సుమారు ఎనిమిది ఎకరాల భూమిని ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ భూములను మొదట తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి, అనంతరం రియల్టర్లకు బదిలీ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పలు ఆర్థిక లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

# శ్రీలంకలో భారత వాయుసేనాధిపతి పర్యటన

- **నేషనల్ డిఫెన్స్ కాలేజీలో ప్రత్యేక ప్రసంగం**
- **21వ శతాబ్దంలో వైమానిక శక్తిపై చర్చ**
- **రక్షణ రంగ సహకారంపై కీలక సమావేశం**

**కొలంబో, మే 22**

భారత వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ శ్రీలంకలో పర్యటించారు. మే 20న ఆయన నేషనల్ డిఫెన్స్ కాలేజ్ శ్రీలంకను సందర్శించి అక్కడ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. "21వ శతాబ్దంలో వైమానిక శక్తి" అనే అంశంపై ఆయన ప్రసంగించినట్లు భారత హైకమిషన్ వెల్లడించింది. ఈ సందర్భంగా ఆధునిక యుద్ధ పరిస్థితుల్లో వైమానిక శక్తి ప్రాధాన్యం, సాంకేతిక పరిణామాలు, భద్రతా వ్యూహాలపై ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ విస్తృతంగా వివరించారు. ప్రపంచ భద్రతా పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో వైమానిక దళాల పాత్ర మరింత కీలకంగా మారుతోందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లు, సైబర్ భద్రత, అంతరిక్ష ఆధారిత రక్షణ వ్యవస్థలపై కూడా ఆయన చర్చించారు. నేషనల్ డిఫెన్స్ కాలేజ్ కమాండెంట్‌తో పాటు శిక్షణ పొందుతున్న కోర్సు పాల్గొనేవారితో కూడా ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రక్షణ రంగంలో భారత అనుభవాలు, ప్రాంతీయ భద్రతా సహకారం, భవిష్యత్తు సవాళ్లపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సమావేశం ద్వారా భారత్--శ్రీలంక రక్షణ సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు భావిస్తున్నారు. భారత్, శ్రీలంకల మధ్య రక్షణ రంగంలో సహకారం గత కొంతకాలంగా మరింత విస్తరిస్తోంది. సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, సంయుక్త శిక్షణ కార్యక్రమాల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత వాయుసేనాధిపతి పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఇండో--పసిఫిక్ ప్రాంత భద్రతలో భాగస్వామ్య దేశాల మధ్య సమన్వయం అత్యంత అవసరమని భారత ప్రతినిధులు పేర్కొంటున్నారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వం కోసం రక్షణ రంగంలో పరస్పర సహకారం కొనసాగించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. శ్రీలంక రక్షణ వర్గాలు కూడా భారత సహకారాన్ని ప్రశంసించినట్లు సమాచారం. ఈ పర్యటన సందర్భంగా ద్వైపాక్షిక రక్షణ సంబంధాల బలోపేతంపై కూడా చర్చలు జరిగాయి. భవిష్యత్తులో సంయుక్త శిక్షణలు, సాంకేతిక సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత



విస్తరించేందుకు రెండు దేశాలు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు తెలిపారు. భారత వాయుసేనాధిపతి పర్యటన రక్షణ రంగ సహకారానికి మరో ముందడుగుగా భావిస్తున్నారు.

# భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

## ఢిల్లీలో ప్రధాని మోదీతో సైప్రస్ అధ్యక్షుడి భేటీ

**- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు - వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో సహకారం విస్తరణ**



**న్యూఢిల్లీ, మే 22 :**

భారత ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడిస్తో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపినట్లు ప్రధాని మోదీ తెలిపారు. భారత్--సైప్రస్ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేయాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. భారత్, సైప్రస్ దేశాల మధ్య ఉన్న సన్నిహిత బంధాలు ఉమ్మడి విలువలపై ఆధారపడి ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇరు దేశాలు మరింత సమగ్ర భాగస్వామ్యంతో ముందుకు సాగనున్నాయని తెలిపారు. పరస్పర సహకారంతో ప్రపంచస్థాయిలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయని చెప్పారు. వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో భారత్--సైప్రస్ సంబంధాలు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య పెట్టుబడుల ప్రవాహం పెరగడం ఆనందదాయకమని తెలిపారు. రానున్న రోజుల్లో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. సాంకేతికత, సముద్ర రవాణా, సేవల రంగం, మౌలిక వసతులు వంటి విభాగాల్లో సహకారం పెంపుపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. వ్యాపార అవకాశాలను విస్తరించడం ద్వారా ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం కలుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వేదికలపై పరస్పర మద్దతును కొనసాగించేందుకు కూడా అంగీకరించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడిస్ భారతదేశంతో సంబంధాలను మరింత బలోపేతం చేయాలని తమ దేశం ఆకాంక్షిస్తోందని తెలిపారు. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం తమ దేశానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహబంధం భవిష్యత్తులో మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ ద్వారా భారత్--సైప్రస్ సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడులు, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారం పెరగడం ద్వారా రెండు దేశాలకు ఆర్థికంగా లాభం చేకూరే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక రంగాల్లో కూడా ఈ భాగస్వామ్యం కీలకంగా మారనుందని విశ్లేషిస్తున్నారు.

# కిడ్నీ మార్పిడుల్లో అరుదైన ఘనత సాధించిన నిమ్స్

**- 2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్లతో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు**

**- నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు**

**హైదరాబాద్, మే 22**



కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో అరుదైన మైలురాయిని అందుకున్న నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య బృందానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. నిమ్స్ యూరాలజీ విభాగం విజయవంతంగా 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి దేశవ్యాప్తంగా అరుదైన రికార్డు నమోదు చేసింది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వేలాది మంది రోగులకు నూతన జీవితం అందించిన నిమ్స్ వైద్య సేవలు ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ల నిర్వహణలో దక్షిణ భారతదేశంలో నిమ్స్ మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో, లూథియానాలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ రెండో స్థానంలో ఉండగా, నిమ్స్ మూడో స్థానంలో నిలిచి విశిష్ట గుర్తింపు పొందింది. ప్రభుత్వ వైద్య సంస్థగా ఇంత పెద్ద స్థాయిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడం వైద్య రంగంలో గొప్ప విజయంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిమ్స్ వైద్యులు, సిబ్బంది అంకితభావంతో సేవలు అందిస్తూ కిడ్నీ బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని అన్నారు. ఆధునిక వైద్య సాంకేతికత, నిపుణులైన వైద్య బృందం, ప్రభుత్వ మద్దతుతో నిమ్స్ దేశంలోనే ప్రముఖ వైద్య సంస్థగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. 2 వేల కిడ్నీ మార్పిడి పొందిన రోగుల్లో 95 శాతం మంది అంటే దాదాపు 1,900 మంది వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా చికిత్స పొందడం విశేషం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకాలు పెద్ద ఊరటనిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ వైద్య సేవల ద్వారా పేదలకు ఖరీదైన శస్త్రచికిత్సలు అందుబాటులోకి రావడం ఆరోగ్యరంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. నిమ్స్ యూరాలజీ విభాగం గత మూడేళ్ల నాలుగు నెలల్లోనే 500 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి మరో రికార్డు సృష్టించింది. 2023 జనవరి నుంచి వేగవంతంగా ట్రాన్స్‌ప్లాంట్లు నిర్వహిస్తూ వైద్య సేవల విస్తరణలో కొత్త ప్రమాణాలు సృష్టిస్తోంది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సమయానుకూలంగా చికిత్స అందించడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం, ఆధునిక సదుపాయాలు, వైద్యుల నైపుణ్యం కలిసివచ్చి నిమ్స్‌ను దేశంలోని ప్రముఖ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాల్లో ఒకటిగా నిలబెట్టాయి. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.

## బి కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత



**కుత్బుల్లాపూర్ మే 22**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 296వ డివిజన్ దుండిగల్‌కు చెందిన కే. అశోక్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్టేట్ ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి,బి కేర్ ఫౌండేషన్ ద్వారా ఆయనకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, బి కేర్ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం మాత్రమే కాకుండా, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని తెలిపారు. ప్రజలకు పార్టీ కార్యకర్తలకు తమ ఫౌండేషన్ ద్వారా భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, దొంతి మహేష్, కృష్ణ యాదవ్, బి కేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆడప బాబ్జి - వెంకటరమణ దంపతుల
## 35వ పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం

**కుత్బుల్లాపూర్ మే 22**




కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సూరారం ప్రాంతానికి చెందిన ఎర్కళ్ రాజు ఆధ్వర్యంలో ఆడప బాబ్జి – ఆడప వెంకటరమణ దంపతుల 35వ వివాహ వార్షికోత్సవ వేడుకలను సేవా కార్యక్రమాల తో ఘనంగా నిర్వహించారు. సూరారం ఎర్కళ్ రాజు తన పుట్టినరోజు కూడా ఇదే రోజున రావడంతో, ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని దంపతులు "ఫీడింగ్ స్మైల్స్ ఫౌండేషన్"లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి భోజనాలు పంపిణీ చేసి తమ సేవా మనోభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యు లు, స్నేహితులు, స్థానికులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ప్రత్యేక రోజును సేవా కార్యక్రమాలతో జరుపుకోవడంఅభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటి డాగ్ 'రోలెక్స్' తనిఖీలు

**కుత్బుల్లాపూర్ మే 22**



సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శుక్రవారం నాగారం మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు అని ఎస్సై చిరంజీవి తెలిపారు గాంజా లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలో హోటల్స్, షాపింగ్ మాల్స్, టీ దుకాణాలు, పాన్ డబ్బాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు సోదాలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భగవాన్ కానిస్టేబుల్ నరసింహ రవీందర్ తదితరులు పాల్గొన్నారు



# లక్షెట్టిపేట ను గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుదాం

### ఎస్సై గోపతి సురేష్





**లక్షెట్టిపేట మే22(మన సమాజం)**

లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని కరీంనగర్ చౌరస్తా తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్ చే విస్తృత తనిఖీలు చేపట్టడం జరిగింది. గంజాయి రహిత రాష్ట్రముగా తీర్చిదిద్దడమే భాగంగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరీంనగర్ చౌరస్తాలోని పలు పాన్ షాప్లు హోటల్లు దాబాలతో పాటు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి డ్రగ్స్ లాంటివి విక్రయించిన వాటికి అలవాటు పడ్డ కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా యువత గంజాయి డ్రగ్స్ బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపాలని ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అన్నారు. యువత బంగారు భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందన్న విషయం గుర్తుపెట్టుకోవాలని వాళ్లను మంచి మార్గంలో నడిపించడంలో పోలీసులకు సహకరించి గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ టీమ్ తో పాటు పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

# సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం..

**రామకృష్ణాపూర్, మే 22, (మన సమాజం):**

పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పార్టీ నాయకులు శుక్రవారం పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న అసంఘటిత రంగా కార్మికులకు కనీస వేతనాలను పెంచడం హర్షనియమన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో కనీస వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న లక్షలాది కార్మికులకు వేతనాల పెంపుతో ఆర్థికంగా లాభపడతారని పేర్కొన్నారు. దీంతో 1.11కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరనుందని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.అనంతరం నాయకులు కార్మికులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం కల, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, ఉపాధ్యక్షులు రాజయ్య, ప్రకాష్, సృజన, ప్రధాన కార్యదర్శులు




వేణు, సురేందర్, సత్యనారాయణ అధికార ప్రతినిధి రాజకుమార్, మహిళా నాయకురాలు రాజేశ్వరి, దీప, పుష్ప, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

# తవక్కల్ క్రికెట్ అకాడమీ ప్రారంభం

### విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి..
### తవక్కల్ గ్రూప్స్ అధినేత అబ్దుల్ అజీజ్..





**రామకృష్ణాపూర్, మే 22, (మన సమాజం):**

తవక్కల్ గ్రూప్స్ ఆధ్వర్యంలో తవక్కల్ క్రికెట్ అకాడమీని విద్యాసంస్థల అధినేత అబ్దుల్ అజీజ్ ఎస్సై శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ మిట్టపల్లి సరిత, డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి తో కలిసి శుక్రవారం ప్రారభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతూ పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఇతర విద్యాసంస్థల విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ లో రాణించే విధంగా ప్రత్యేక శిక్షకులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తవక్కల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మరిన్ని సేవలు చేయడానికి ముందున్నట్లుగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్,సీపీఐ,కాంగ్రెస్ పార్టీల పట్టణ అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్, వోడ్నాల శ్రీనివాస్, నాయకులు పల్లె రాజు క్రీడాకారులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల గోస
# ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

### టిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి

**కుత్బుల్లాపూర్**



రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు పడిగాపులు కాస్తున్నా, సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ టిఆర్ఎస్ నాయకులు కప్పాటి పాండురంగా రెడ్డి అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని తరలించిన 50% కూడా కొనుగోలు చేయలేదని. ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల పేరుతో, ఆరబెట్టిన ధాన్యంపై కూడా 'తేమ ఎక్కువ ఉంది' అని సాకు చెబుతూ క్వింటాలుకు 5 నుండి 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద కనీసం త్రాగునీరు, నీడ లేక రైతులు, కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాల భయంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవు. ఒకవేళ ధాన్యం విక్రయించినా, రైతు ఖాతాల్లోకి డబ్బులు ఎప్పుడు జమవుతాయో తెలియని అయోమయ స్థితి నెలకొంది. దీనివల్ల తదుపరి సాగుకు పెట్టుబడి కోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం సన్న రకం వరిని పండించే రైతులకు క్వింటాకు రూ. 500 అదనపు బోనస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరగా జమ చేయాలని అన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, అవసరమైనంత మేర గన్నీ బ్యాగులు అందించాలి.?తేమ శాతం పేరుతో రైతులను వేధించే మిల్లర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అన్నదాతల కష్టాలను గుర్తించి ధాన్యం కొనుగోలును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేసారు లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టులో పిటిషన్

**విద్యార్థులపై అదనపు భారం అంటూ అభ్యంతరాలు**

**వచ్చే వారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వెల్లడి**

**జూలై 1 నుంచి మూడో భాష బోధన ప్రారంభం**

**న్యూఢిల్లీ, మే 22:**
సీబీఎస్ఈ అనుబంధ విద్యాసంస్థల్లో త్రిభాషా విధానాన్ని తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి నుంచే త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సీబీఎస్ఈ నిర్ణయించగా, దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రముఖ సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

త్రిభాషా విధానం అమలుతో విద్యార్థులపై అదనపు ఒత్తిడి పడే అవకాశముందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే పాఠ్యభారం ఎక్కువగా ఉన్న సమయంలో ఒక్కసారిగా మూడు భాషలు నేర్చుకోవడం విద్యార్థులకు కష్టమవుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పదో తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని వాదించారు. ఈ అంశంపై స్పందించిన సుప్రీంకోర్టు కేసును వచ్చే వారం విచారణకు తీసుకుంటామని తెలిపింది. సీబీఎస్ఈ ఇటీవలే త్రిభాషా విధానంపై అధికారిక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ జూలై 1 నుంచి మూడో భాష బోధన ప్రారంభం కానుంది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్--2022 ప్రకారం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆర్-1, ఆర్-2, ఆర్--3 విధానాల కింద త్రిభాషా బోధన కొనసాగుతుంది. మూడు భాషల్లో కనీసం రెండు భారతీయ భాషలు తప్పనిసరిగా ఉండాలని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. మూడో భాషగా మరో భారతీయ భాషను లేదా విదేశీ భాషను ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించారు. త్రిభాషా విధానం కోసం సీబీఎస్ఈ మొత్తం 42 భాషలను ఎంపిక చేసి వాటికి సంబంధించిన సిలబస్ రూపొందించింది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పొందుపర్చిన భాషలను విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చు. వచ్చే ఏడాది పదో తరగతిలో కూడా త్రిభాషా విధానం అమల్లోకి రానున్నప్పటికీ, దీనికి ప్రత్యేక బోర్డు పరీక్ష నిర్వహించబోమని సీబీఎస్ఈ వెల్లడించింది. మూడో భాషకు సంబంధించిన మార్కులను అంతర్గత మూల్యాంకనం ఆధారంగా తుది ఫలితాల్లో కలుపుతామని బోర్డు తెలిపింది.

# 721 ఏళ్ల తర్వాత భోజ్‌శాలలో మహాహారతి

**భోజ్‌శాల సరస్వతీ దేవి ఆలయమని హైకోర్టు వ్యాఖ్యలు**





**న్యూఢిల్లీ, మే 22**
మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల ఆలయం వద్ద శుక్రవారం చారిత్రాత్మక ఘట్టం చోటుచేసుకుంది. సుమారు 721 ఏళ్ల తర్వాత భోజ్‌శాలలో మహాహారతి నిర్వహిస్తున్నారు. ధార్ జిల్లాలో ఉన్న ఈ ప్రదేశంలో ఇన్నాళ్లుగా ముస్లింలు నమాజ్ నిర్వహిస్తుండగా, ఇటీవల మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో పరిస్థితుల్లో మార్పు వచ్చింది. భోజ్‌శాల సరస్వతీ దేవి ఆలయమని కోర్టు తన తీర్పులో పేర్కొంది. హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత వచ్చిన తొలి శుక్రవారం కావడంతో ఆలయ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 1800 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల మధ్య కట్టుదిట్టమైన భద్రత నడుమ మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకే ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సచిన్ శర్మ వెల్లడించారు. శుక్రవారం ఉదయం సరస్వతీ దేవికి ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కమల్ మౌలా మసీదుకు చెందిన కేర్‌టేకర్ ఖ్వాజీ మొయినుద్దీన్ ప్రత్యేక లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు తీర్పుపై తమ అభ్యంతరాలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 2024లో పురావస్తు శాఖ నిర్వహించిన సర్వేలో భోజ్‌శాలను సరస్వతీ దేవి ఆలయంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఆవరణలో సంస్కృత భాషలో శాసనాలు ఉన్నట్లు తేలిందని పేర్కొన్నా రు. అంతేకాకుండా హవనకుండం, ఆలయ నిర్మాణ కళకు సంబంధించిన ఆనవాళ్లు కూడా గుర్తించినట్లు పురావస్తు శాఖ వెల్లడించింది.

# తమిళనాడులో ఎంఆర్ఎఫ్ విస్తరణ చర్చలు

**సీఎం విజయ్‌తో ఎంఆర్ఎఫ్ ప్రతినిధుల భేటీ**

**పెట్టుబడులు, ఎగుమతులపై కీలక చర్చ**

**తమిళనాడులో కార్యకలాపాల విస్తరణకు ప్రణాళికలు**

**చెన్నై, మే 22**
తమిళనాడులో పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన కీలక సమావేశం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ప్రముఖ టైర్ తయారీ సంస్థ ఎంఆర్ఎఫ్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎం. మమ్మెన్‌తో పాటు డిప్యూటీ చైర్మన్ అరుణ్ మమ్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ మమ్మెన్ తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ను కలిశారు. రాష్ట్రంలో ఎంఆర్ఎఫ్ కార్యకలాపాలు, భవిష్యత్ పెట్టుబడులపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. తమిళనాడులో ఇప్పటికే కొనసాగుతున్న ఎంఆర్ఎఫ్ పరిశ్రమల పనితీరు, ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణపై ముఖ్యమంత్రి కార్యాలయంలో చర్చలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా తయారీ విభాగాలు, ఎగుమతుల విస్తరణకు సంబంధించిన కొత్త పెట్టుబడులపై సంస్థ ప్రతినిధులు ప్రభుత్వానికి వివరించినట్లు తెలిసింది. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తమిళనాడులో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎంఆర్ఎఫ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎగుమతుల విభాగాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఆటోమొబైల్ రంగానికి అనుబంధ పరిశ్రమల అభివృద్ధిలో ఎంఆర్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల విధానాలు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. పరిశ్రమల విస్తరణకు అవసరమైన భూములు, విద్యుత్, రవాణా



సదుపాయాలపై ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం విజయ్ హామీ ఇచ్చినట్లు సమాచారం. తమిళనాడును దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంఆర్ఎఫ్ సంస్థ దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రముఖ స్థానం సంపాదించుకుంది. టైర్లు, ఆటోమొబైల్ ఉత్పత్తుల తయారీలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. తమిళనాడులోని తయారీ యూనిట్లు కంపెనీకి ప్రధాన కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమివ్వనున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సమయంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పరిశ్రమల విస్తరణతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకురావడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

## తెలంగాణలో గ్రామాల అభివృద్ధికి బ్యాంకులు భాగస్వాములు కావాలి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మే 22:**
తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 'తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ (జణ) నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు (మొండి బకాయిలు) 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి.

# ఎగుమతిదారులకు కేంద్రం భరోసా

**వాణిజ్య వ్యవస్థ బలోపేతానికి చర్యలు**

**పోర్టులు, ఎగుమతిదారులతో కేంద్ర మంత్రుల సమావేశం**

**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ప్రత్యేక దృష్టి**



**న్యూఢిల్లీ, మే 22 :**
భారత ఎగుమతిదారులు, దిగుమతిదారులు, పోర్టు అధికారులతో కేంద్ర ప్రభుత్వం కీలక సమావేశం నిర్వహించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర పోర్టులు, నౌకాశ్రయాలు, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సంయుక్తంగా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. భారత వాణిజ్య వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారత ఎగుమతిదారులు ప్రపంచ స్థాయిలో మరింత పోటీతత్వంతో ముందుకు సాగేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సమన్వయంతో కూడిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. "హోల్ ఆఫ్ ది గవర్నమెంట్" విధానంతో అన్ని శాఖలు కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత వాణిజ్య రంగాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు. పోర్టుల అభివృద్ధి, సరుకు రవాణా వేగవంతం, ఎగుమతి విధానాల్లో సరళీకరణ ద్వారా వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. దేశీయ వ్యాపార వ్యవస్థను మరింత సులభతరం చేయడమే లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పీయూష్ గోయల్ తెలిపారు. వ్యాపార అనుమతులు, రవాణా, దిగుమతి-ఎగుమతి ప్రక్రియలను పారదర్శకంగా మార్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వ్యాపారులకు తక్కువ సమయంలో సేవలు అందేలా డిజిటల్ విధానాలను విస్తరిస్తున్నామని వెల్లడించారు. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ భారత పోర్టులను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సరుకు రవాణాలో జాప్యాలు తగ్గించి, ఎగుమతిదారులకు వేగవంతమైన సేవలు అందించేందుకు పోర్టు మౌలిక వసతులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. సముద్ర రవాణా రంగంలో భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎగుమతిదారులు, దిగుమతిదారులు, పోర్టు అధికారులు తమ సమస్యలు, సూచనలు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. వాణిజ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు స్వాగతించారు. భవిష్యత్తులో భారత వ్యాపార రంగానికి మరిన్ని అవకాశాలు కల్పించే విధంగా విధానాలు అమలు చేయాలని కోరారు.

## పోక్సో కేసులో ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**- నిందితుడిని తొమ్మిది రోజుల పాటు కాపాడారని ఆరోపణలు**

**- ఆడబిడ్డకు న్యాయం జరగలేదని మండిపాటు**

**హైదరాబాద్, మే 22:**
పోక్సో కేసులో నిందితుడిని తొమ్మిది రోజుల పాటు దాచి ఉంచిన బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మధ్య ఉన్న అనుబంధం వల్లే బాధిత బాలికకు అన్యాయం జరిగిందని విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక తనకు అన్యాయం జరిగిందని కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి వేధించారని కేటీఆర్ ఆరోపించారు. నిందితుడిని అరెస్ట్ చేయకుండా తొమ్మిది రోజుల పాటు కాపాడిందీ రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్రంగా స్పందించడంతోనే చివరికి ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితుల్లో అరెస్ట్ చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు బెయిల్ ఇవ్వబోదని స్పష్టం చేసిన తర్వాతే చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రధానమంత్రి పర్యటన కారణంగా పోలీసులు బిజీగా ఉన్నారని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. "ప్రధానమంత్రి వస్తే మూడు రోజుల పాటు నేరస్థులు స్వేచ్ఛగా తిరగాలా?" అని ప్రశ్నించారు. రాష్ట్ర హోంశాఖకు బాధ్యుడైన ముఖ్యమంత్రి ఇలాంటి సాకులు చెప్పడం బాధాకరమన్నారు. పోక్సో కేసు వంటి సున్నితమైన అంశంపై తాము ఇప్పటి వరకు రాజకీయాలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ముఖ్యమంత్రి తమపై విమర్శలు చేయడంతో స్పందించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దేశంలో ఎక్కడైనా పోక్సో కేసు నిందితుడు తొమ్మిది రోజుల పాటు తప్పించుకొని తిరిగిన ఉదాహరణ ఉందా అని ప్రశ్నించారు. కేవలం అధికార అండదండల వల్లే నిందితుడు తప్పించుకున్నాడని ఆరోపించారు. బాధిత కుటుంబంపై 'హనీ ట్రాప్' పేరుతో కౌంటర్ కేసులు పెట్టడం వెనుక ఎవరు ఉన్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సన్నిహితుల ఆసుపత్రిలో నిందితుడిని దాచిపెట్టారనే వార్తలపై విచారణ జరపాలని కోరారు. ఒకవైపు తన కుమారుడికి సంబంధం లేదని కోర్టులో చెప్పి, మరోవైపు తానే పోలీసులకు అప్పగించానని చెప్పడం ఎలా సాధ్యమో బండి సంజయ్ సమాధానం చెప్పాలని అన్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని, మీడియాను అప్రమత్తం చేస్తూ ముందుకు వెళ్లారని కేటీఆర్ ప్రశంసించారు. ఆయనపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు అన్యాయం జరిగిన ప్రతిసారి తామే పోరాడామని, భవిష్యత్తులో కూడా బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో మీడియా పాత్రపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. "హనీ ట్రాప్" అంటూ వార్తలు రాయించిన వ్యక్తులు ఎవరో బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

# వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

## ఎంసీలో ధాన్యం లోడింగ్ అన్ లోడింగ్ పరిశీలించిన సీపీ రష్మీ పెరుమాళ్

**హుస్నాబాద్, మే 22**

స్థానిక మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ శుక్రవారం పరిశీలించారు. యార్డులో ధాన్యం నిల్వలు, ట్రాక్టర్ల రాకపోకలు, లోడింగ్ – అన్‌లోడింగ్ విధానాన్ని పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ధాన్యం తూకం, తరలింపు, హమాలీల సమన్వయం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులో రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా ట్రాక్టర్లను క్రమపద్ధతిలో లోపలికి అనుమతించాలని అధికారులకు తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారి కష్టానికి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు, మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. రైతులు కూడా సహనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రస్తుతం సజావుగా కొనసాగుతోందని,



హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం లోడ్ అన్లోడింగ్ ప్రక్రియ పరిశీలిస్తున్న సిపి పెరుమాళ్

రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. మార్కెట్ యార్డులో పోలీస్ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచి ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అందరూ సమన్వయంతో వ్యవహరిస్తే కొనుగోలు ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుందని సీపీ పేర్కొన్నారు.

# హుస్నాబాద్ సీఐ, ఐవో కె. శ్రీనివాస్ నేతృత్వంలో హత్య కేస్ స్పీడ్ ఇన్వెస్టిగేషన్

### మంచినీళ్లబండ సంఘటనలో దూసుకెళ్తున్న దర్యాప్తు

### గంటల వ్యవధిలోనే కేసు పురోగతి

**హుస్నాబాద్, మే22**

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండలో జరిగిన మహిళ హత్య కేసు దర్యాప్తును హుస్నాబాద్ పోలీసులు అత్యంత వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సంచలన కేసుకు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ (ఐవో)గా హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండ్ర శ్రీనివాస్ వ్యవహరిస్తుండగా, కేసు ఛేదన దిశగా కీలక పురోగతి సాధించినట్లు సమాచారం. కేసుల దర్యాప్తు, పరిశోధనలో నిష్ణాతుడిగా పేరున్న సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు చెందిన ఎస్ఐలు పాకాల లక్ష్మారెడ్డి, చాతరాజు ప్రశాంత్, పుల్ల అభిలాష్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ కొనసాగిస్తున్నారు.హత్య జరిగిన కేవలం 15 గంటల్లోనే కీలక వ్యక్తిని



దుండగుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన బోయిని రాజ్యలక్ష్మి(ఫైల్)

అదుపులోకి తీసుకోవడం పోలీసుల చాకచక్యానికి నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా ముగ్గురు ఎస్ఐలు సమన్వయంతో వ్యవహరించి కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించడంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.మొదట దోపిడీ కోణంలో కనిపించిన ఈ హత్య కేసు.. ప్రస్తుతం కుట్ర, పరిచయస్తుల ప్రమేయం వైపు మళ్లినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలంలో సేకరించిన ఆధారాలు, కాల్ డేటా, అనుమానితుల కదలికల ఆధారంగా పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ దర్యాప్తులో మరికొద్ది గంటల్లోనే నిందితులను పోలీసులు అధికారికంగా ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

- **వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు**
- **తెలంగాణలో వడదెబ్బతో 22 మంది మృతి**
- **ఏపీలో 48 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**హైదరాబాద్, అమరావతి, మే 22**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచే మండిపోతున్న ఎండలు మధ్యాహ్నానికి అగ్నిగుండంలా మారుతు న్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావొద్దని ప్రజలకు సూచించింది. తెలంగాణ రాష్ట్రంలో వడదెబ్బ తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. ఒక్కరోజులోనే వడదెబ్బ కారణంగా 22 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. రోహిణికార్తె మొదలుకాకముందే రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హన్మకొండ, రామగుండం, భద్రాచలం ప్రాంతాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా వడగాలులు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. నగరంలో 42 నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత, వేడి గాలులతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎండలు విపరీతంగా పెరిగాయి. పల్నాడు జిల్లాలో నిన్న 48 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. పిడుగురాళ్ల ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. బాపట్ల జిల్లా



వేటపాలెం, ప్రకాశం జిల్లా అద్దంకి ప్రాంతాల్లో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా, మరో 150 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలుల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు మధ్యాహ్నం సమయాల్లో నిర్మాను ష్యంగా మారుతున్నాయి. రైతులు, కూలీలు, రోడ్లపై పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, తాగునీటి కేంద్రాలను ప్రజలు వినియోగించు కోవాలని అధికారులు సూచిస్తున్నారు. వైద్య నిపుణులు ప్రజలకు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని, తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

# అదనపు ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి..

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - లీకేజీలకు అడ్డుకట్ట వేసి బడ్జెట్ లక్ష్యాలు సాధించాలని ఆదేశం**
- **వనరుల సమీకరణ కేబినెట్ ఉపసంఘ సమావేశంలో కీలక సమీక్ష**

**హైదరాబాద్, మే 22 :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరుల సమీకరణపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేలా ప్రతి శాఖ కార్యాచరణ రూపొందిం చాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన "రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ" ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. వివిధ శాఖల అదనపు ఆదాయ వనరులు, వాటి పురోగతిపై మంత్రులు, ఉన్నతాధికారులు విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా ఆదాయ వనరుల సమీకరణ జరగాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ఆదాయానికి నష్టం కలిగించే లీకేజీలను పూర్తిగా అరికట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అందుబాటులో ఉన్న అన్ని ఆదాయ మార్గాలను పూర్తిస్థాయిలో వినియోగించి బడ్జెట్ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రతి శాఖ ముందుగా నిర్ణయించిన క్యాలెండర్, టైమ్‌లైన్ ప్రకారం పనిచేస్తూ ఆదాయ వృద్ధికి కృషి చేయాలని చెప్పారు.ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాలకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అనివార్య కారణాల వల్ల ప్రత్యక్షంగా హాజరుకాలేని అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాల్లో పాల్గొనా లని ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆదాయ వనరులను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు.ఇప్పటికే కేబినెట్ తీసుకున్న నిర్ణయాల మేరకు రాష్ట్రవ్యాప్తం గా భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ధరలను మే 28 నుంచి పెంచుతున్నట్లు అధికారులు సమావేశంలో తెలిపారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశముందని వెల్లడించారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ అధికారి

- **రూ.25 వేల లంచం స్వీకరిస్తుండగా పట్టివేత**
- **మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఏసీబీ దాడి**

**మెదక్, మే 22**



మెదక్ జిల్లా నర్సాపూర్ విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. నర్సాపూర్ ఆపరేషన్స్ విభాగానికి చెందిన ఏడీఈ ముద్దం రమణారెడ్డి అధికారిక పనికి సంబంధించి రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారునికి సంబంధించిన 11 వర్క్ బిల్లులను మెదక్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేయడానికి ముద్దం రమణారెడ్డి లంచం కోరినట్లు తెలిసింది. మొత్తం రూ.3,13,882 విలువైన బిల్లులను ముందుకు పంపేందుకు రూ.25 వేల రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా ఉచ్చుపన్ని శుక్రవారం మధ్యాహ్నం నర్సాపూర్ కార్యాలయంలో దాడి నిర్వహించారు. లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజా విధులను నిజాయితీగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అక్రమ లాభం కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగు తోంది.ఫిర్యాదుదారుని వివరాలను భద్రతా కారణాల రీత్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరింది. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ఏసీబీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌కు వినతి

- **లంబాడ ప్రజాప్రతినిధుల బృందం ముఖ్యమంత్రితో భేటీ**
- **ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్**



**హైదరాబాద్, మే 22**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను లంబాడ ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేసింది. లంబాడీల ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరుతో ప్రత్యేకంగా "సంత్ సేవాలాల్ కార్పొరేషన్" ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. లంబాడ సమాజ అభివృద్ధి, ఆర్థిక సాధికారత కోసం ఈ కార్పొరేషన్ కీలకంగా ఉపయోగపడుతుందని ప్రతినిధులు వివరించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని కూడా బృందం విజ్ఞప్తి చేసింది. గిరిజనుల సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలంటే ప్రత్యేక కమిషన్ అవసరమని వారు పేర్కొన్నారు. ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో వేగం పెరగడంతో పాటు పరిపాలనా స్థాయిలో మరింత ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. ఈ భేటీలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రాందాస్ నాయక్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ కూడా ముఖ్యమంత్రిని కలిసి తమ అభిప్రాయాలు వెల్లడించారు.తెలంగాణ గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) చైర్మన్ బెల్లయ్య నాయక్ సహా పలువురు గిరిజన నాయకులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. లంబాడ సమాజానికి విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అవసరమని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ పేరు మీద కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే గిరిజన యువతకు ప్రత్యేక పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాయం, శిక్షణ కార్యక్రమాలు అమలు చేయడానికి అవకాశం ఉంటుందని ప్రతినిధులు వివరించారు. సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వారి వినతులను శ్రద్ధగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. లంబాడ సమాజ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.